# జైలు కథలు

## 3

"ప్రసాద్ బాబూ."

అప్రయత్నంగా కళ్ళు తెరిచాను. అప్పుడే మాగన్నుగా నిద్రపట్టింది. ఎదురుగా అపరిచితుడు. పెద్ద పెద్ద మీసాలు, విశాలమైన కండ్లు, సంస్కారము లేని జుట్టు. అతనిపై నాకేమంత సదభిప్రాయం కలుగలేదు. క్రొత్త ఖైదీగా గ్రహించాను.

ఏమిటన్నట్లు చూశాను.

"జాబు రాసి పెట్టండి" మాటల్లో అభ్యర్థన.

చుట్టూ కలయచూశాను. బ్లాక్‌లో వున్న వారంతా నిద్రపోతున్నారు.

లేచి కూర్చున్నాను.

"పేరు"

"నవరయ్య.... మీసాల నవరయ్య"

నవ్వాను. తగిన పేరు

జాబు వ్రాసి చదివి వినిపించాను, "వెళ్ళి గేటువద్ద యివ్వు."

"అంటించండి బాబూ" ఆశ్చర్యపోయాను. ఇంత సౌమ్యత. వినయం అతనిమాటల్లో వూహించని నేను, మొదట ఏర్పర్చ అభిప్రాయాన్ని దూరంచేసికో సాగాను

"అంటించకూడదు. అలాగే గేటువద్ద యివ్వు. వారు సెన్సారు చేసి, అంటించి, పంపిస్తారు"

సెన్సారు అనేమాట అర్థమయిందో లేదోగాని నమ్మినబంటులా తల వూపుతూ వెళ్ళాడు.

కాసేపాగి మరలా వచ్చాడు "ఏం నవరయ్యా!"

"నాకు శిక్ష పడుతుందా బాబూ!" ఏదో తెలియని బాధ అతని గొంతు పట్టేసిందని గ్రహించాను.

"ఏ నేరం?"

"భార్యను చంపాను" అచ్చితమైన సమాధానానికి తృళ్ళిపడ్డాను.

"అవును బాబూ.... భార్యను కసాయి వాడినై.... ఈ చేతుల్తోనే కత్తితో పొడిచి చంపాను.... బాబూ పశ్చాత్తాపం పెల్లుబుకుతోంది.

"ఆమె నేరం?"

"నా భార్య కావటమే!" విక్కచ్చి సమాధానం.

"చెబుతాను.... అంతా చెబుతాను బాబూ" కారుతున్న కన్నీళ్ళతో తలపైకెత్తాడు.

* * *

నవరయ్యది మహబూబ్‌నగర్ జిల్లా అచ్చంపేట వద్దనున్న వొక కుగ్రామం. అరుగురు సంతానం. వడ్డెర కులస్థుడు కావడంతో భార్య. భర్త రాళ్ళు కొట్టి జీవిస్తూ ఉన్నారు. కూలీ యిద్దరూ చేస్తారు. కాని సంసారం ఆమె సంపాదనపై మాత్రమే జరగాలి. కారణం నవరయ్యకున్న త్రాగుడు. డబ్బు లేనప్పుడు అప్పుగా త్రాగుతాడు. బట్వాడా వచ్చిన రోజు యిచ్చేస్తాడు. మరల వారమంతా బాకీ. పాపం ఆ యిల్లాలుగాని, పిల్లలుగాని ఈతని కష్టం వొక పూటైనా తిని వుంటారా అంటే చెప్పలేని విషయం. డబ్బు యివ్వకపోయినా త్రాగివెళ్ళి మంచి కూర లేదని, బూతులాడటం పరిపాటి అయింది.

ఆరోజు బట్వాడా తీసికొని తిన్నగా కల్లు దుకాణానికి వెళ్ళాడు. అప్పటివరకూ అయిన బాకీ తీర్చాడు. మిగిలిన డబ్బుతో త్రాగాడు. కొద్ది కొద్దిగా నిషా ఎక్కుతూ వుంది. అదే సమయంలో నవరయ్య స్నేహితులని చెప్పుకోదగినవారు యిద్దరు వచ్చారు. మాటలతో నవరయ్యను ఎక్కించారు. వారి మాటల సారాంశం.... ఎలాగైనా నవరయ్యచేత డబ్బు ఖర్చు పెట్టించి త్రాగటం. తనవద్ద డబ్బులేదని నచ్చజెప్పాడు, కాని వారు వదల్లేదు.

"అదేంటోయ్ డబ్బు లేదంటావ్. ఈరోజేగదా బట్వాడా?" మొదటివాడు.

"భార్యకు యిచ్చివచ్చుంటాడు." రెండవవాడు రెచ్చగొట్టాడు.

"అయినా ఫరవాలేదులేరా! మన నవరయ్య అనుకోవాలేగాని భార్యను అడిగి డబ్బు తెచ్చి త్రాపుతాడురా" నిషాలో వున్న నవరయ్యకు ఈ మాటలు వుషారెక్కించినై. అగ్నికి ఆజ్యం పోసినట్లయింది. స్థిరవిశ్వాసంతో యింటివేపు వెళ్ళాడు.

నవరయ్యను చూడగానే పిల్లలు మామూలుగా పలాయన మంత్రం పఠించారు. పెద్ద పిల్ల సావిత్రి రొట్టె తింటూ, ఎటూ వెళ్ళలేక, బిక్కు బిక్కుమంటూ మూలకు వొదిగిపోయింది. డబ్బుకొరకు భార్యను బ్రతిమాలాడు. భయపెట్టాడు. కాని ఫలితం శూన్యం. ఆమె యివ్వదు. ఆమెకు తెలుసు డబ్బు యిస్తే ఈ వారమంతా పిల్లలు తినే ఒక్కపూట అన్నం కూడా వారికి దొరకదు.

నవరయ్యలో సహనం నశించింది. మానవత్వం మంటగలిసింది. కసాయితనం కదం త్రొక్కింది. దానవత్వం దాపురించింది. లోకం తెలియలేదు. నిషా



తలకెక్కింది. స్నేహితుల దగ్గర మాట దక్కాలి. అదే నవరయ్య మనసులో బలంగా చోటు చేసుకుంది.

అంతే.... అనుకోని అనర్థం జరిగిపోయింది. మాంసం కోసే బాకు భార్య గుండెను కోసేసింది. అంతవరకే తెలుసుకున్నాను నవరయ్య చెప్పినదాన్నిబట్టి.

ఆరు నెలల తరువాత తెలిసింది. ప్లీడరు ఎంత ప్రయత్నించినా నవరయ్య పెద్ద కూతురు చెప్పిన సాక్ష్యంతో నవరయ్యకు యావజ్జీవ శిక్ష పడిందని.

—'ప్రసాద్'



### టికెట్ !

ఇద్దరు త్రాగుబోతువాళ్ళు రైల్వే. ప్లాట్‌ఫారంపై ఇలా మాట్లాడుకుంటున్నారు.

ఒకడు : అరె, మనం ఎక్కకుండానే రైలు వెళ్ళిపోతోందే!

రెండవ వ్యక్తి : ఏడ్చింది. అది ఎక్కడికిపోద్ది. టికెట్ నా జేబులో వుంటే.

—కుమిలి వెంకటలక్ష్మి (శివరాం)